క్లుప్తంగా

కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



పరీక్ష కేంద్రం వద్ద విధుల్లో ఉన్న ఎస్సై అంకమరావు, సిబ్బంది

మార్కాపురం: మార్కాపురం రూరల్ పరిధిలోని రాయవరం, గజ్జలకొండ, గురుకుల పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను రూరల్ ఎస్సై అంకమరావు గురువారం పరిశీలించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్ష కేంద్రాల వద్దకు తల్లిదండ్రులకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలి



వీఆర్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్

కంభం: పేదలు ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ వి.కిరణ్ సూచించారు. కందులాపురం పరిధిలోని లేఔట్లను గురువారం ఆయన రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. నిర్మాణం మధ్యలో నిలిపేసిన గృహాల లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని హౌసింగ్, సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వీఆర్వోలు ఉన్నారు.

25న మండల సర్వసభ్య సమావేశం

కొమరోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 25వ తేదీన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లుగా ఎంపీడీఓ మస్తాన్‌వలి తెలిపారు. ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి మండల స్థాయి అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలని, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని సూచించారు.

విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణపై రాయితీ

కొమరోలు: గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడు క్రమబద్ధీకరించుకోవడంపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. గృహ వినియోగదారులు డెవలప్‌మెంట్ చార్జీల కింద విద్యుత్ శాఖకు రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుందని, కానీ జూన్ 30వ తేదీలోగా క్రమబద్ధీకరణ దరఖాస్తు చేసుకునే వారు రూ.1000 చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు.

100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

కొమరోలు: మండలంలోని యర్రగుంట్ల సమీపంలో అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కేంద్రంపై ఎక్సైజ్ అధికారులు గురువారం దాడి చేశారు. గిద్దలూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎంజే రావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నిందితుడిని అరెస్టు చేయడంతోపాటు అతని నుంచి 20 లీటర్ల నాటుసారా, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించామన్నారు.

సుందరయ్య కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని సుందరయ్య కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కాలనీ వాసులు మున్సిపాలిటీ ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ నాయకులు సోమయ్య మాట్లాడుతూ.. సుందరయ్య కాలనీలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలన్నారు. వర్షం పడితే పరిస్థితి దారుణంగా ఉంటోందన్నారు. మున్సిపల్ కమిషనర్ కాలనీలో పర్యటించి సమస్యలు గుర్తించాలని కోరారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విక్టర్, రాజబాబు, శారా, దేవమ్మ, కాశయ్య, రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

గాడి తప్పుతున్న పాలన

- ఇష్టారీతిగా ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ
- సమయపాలన పాటించడం లేదని ఆరోపణలు
- పలు కార్యాలయాలు ఎక్కడున్నాయో కూడా ప్రజలకు తెలియని దుస్థితి
- ప్రజల కంటే ముందుగా కూటమి నాయకులకు సమాచారం



గురువారం కంభంలో మూతపడిన మత్స్యశాఖ కార్యాలయం

కంభం:

పాలకుల ఉదాసీనత, ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరి వెరసి కంభం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పాలన గాడి తప్పుతోంది. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉంటారో? ఎప్పుడు ఉండరో అర్థం కాక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఎంపీడీఓ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఓ గోడౌన్‌లో గత కొన్నేళ్లుగా ఉద్యానవనశాఖ, మత్స్యశాఖ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఒకే గదిని రెండు భాగాలుగా విభజించి రెండు శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఉద్యానవన శాఖాధికారిణి మూడు మండలాల్లో పర్యటిస్తూ కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు. ఇక అదే గదిలో ఉన్న మత్స్యశాఖ కార్యాలయంలో సిబ్బంది ఎప్పుడు ఉంటారో ఎప్పుడు ఉండరో ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఇక్కడ మత్స్యశాఖ కార్యాలయం ఉందా ఉంటే తామెప్పుడూ చూడలేదే అని పలువురు సమాధానమిస్తున్నారు. మత్స్యశాఖాధికారికి కంభంతో పాటు మరో చోట బాధ్యతలు ఉండటంతో ఆయన ఇక్కడికి ఎప్పుడొస్తారో తెలియదు. అడపాదడపా ఫిషరీస్ అసిస్టెంట్లు మాత్రమే కనిపిస్తుంటారు. మిగిలిన సమయాల్లో కార్యాలయం గది ఎప్పుడూ మూతపడే ఉంటుంది. పక్కనే ఉన్న పీఏయూ సైతం ఎప్పుడూ ఖాళీగా దర్శనమిస్తుంటుంది. ఇక ఇరిగేషన్ కార్యాలయంలో సిబ్బంది సైతం సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం స్థానిక కల్కి భగవాన్ వీధిలోని ఓ అద్దె భవనంలో నిర్వహిస్తుండగా ఈ విషయం మండల ప్రజల్లో చాలా మందికి తెలియదు. ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఉన్న అతిథి గృహంలో అధికారులు, ప్రజాప్రతినిధుల కన్నా ఎక్కువగా ప్రైవేట్ వ్యక్తులే సేద తీరుతూ కనిపిస్తున్నారు. కంభం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారుల తీరే వేరుగా ఉంటోంది. ప్రభుత్వ పథకాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన సమాచారం మీడియాకు వెల్లడించడమే మానేశారు. పేరుకు సర్క్యులర్‌లో మాత్రం 'నకలు-అందరు పత్రికా విలేకరులకు' అని ప్రచురిస్తారే తప్ప ఏ ఒక్క పాత్రికేయుడికీ సమాచారం అందించరు. దీంతో ఆ సమాచారం ప్రజల వద్దకు చేరడం లేదు. అధికార పార్టీ నాయకులకు మాత్రం అందరికంటే ముందే సమాచారం ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సంక్షేమ పథకాల వివరాలు ప్రజలకు తెలిసేలోపే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కూడా పూర్తయిపోతుండటంతో అర్హులైన వారు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై నెలల తరబడి ఉంచిన ఇసుక



రోడ్డుపై నిలిపిన లారీలు

హైవేతలు

- నరకప్రాయంగా హైవే సర్వీస్ రోడ్లపై ప్రయాణం
- ఏళ్లు గడుస్తున్నా తీరని ట్రాఫిక్ సమస్య

బేస్తవారిపేట: ప్రయాణం సాఫీగా సాగాల్సిన జాతీయ రహదారిపై వాహనదారులకు నిత్యం నరకం కనిపిస్తోంది. బేస్తవారిపేట మండల కేంద్రంలో బస్టాండ్ నుంచి జంక్షన్ వరకు జాతీయ రహదారిపై ప్రయాణం చేయాలంటే భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది. హైవే ఇరువైపులా సర్వీస్ రోడ్లపై ఆటోలు, లారీలు నిలిపి ఉంచడం, తోపుడు బండ్లు, టిఫిన్ హోటళ్లు నిర్వహిస్తుండటం, దుకాణాలకు వచ్చే వారు తమ బైకులను ఎక్కడపడితే అక్కడ నిలిపి ఉంచుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పొరపాటున ఏదైనా కారు సర్వీస్ రోడ్డులో వస్తే నరకాన్ని చవిచూడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

పరిశీలనలకే పరిమితం

సర్వీస్ రోడ్ల విస్తరణపై, స్థానికంగా రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ కొద్ది నెలల క్రితం బేస్తవారిపేటలో పర్యటించారు. దుకాణాలు, గృహాల యజమానులతోనూ మాట్లాడారు. ప్రభుత్వ స్థలం ఉన్నంత వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడతామని స్పష్టం చేశారు. ఈ తరహా పరిశీలనలు పలుమార్లు పూర్తయినా రోడ్డు విస్తరణ పనులు మాత్రం ముందుకు కదలలేదు. ఆక్రమణల తొలగింపు పేరుతో హడావుడి చేయడం మినహా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సర్వీస్ రోడ్లు రోజురోజుకూ కుంచించుకుపోతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం

గతంలో హైవే రోడ్డు నిర్వహణ సిబ్బంది, పోలీస్ అధికారులు సంయుక్తంగా సర్వీస్ రోడ్లను పర్యవేక్షించేవారు. ఇష్టారీతిగా దుకాణాలు నిర్వహించకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకునేవారు. నేడు అలాంటి పరిస్థితి లేకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. సర్వీస్ రోడ్ల పర్యవేక్షణ తమ పని కాదన్నట్లుగా హైవే అధికారులు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బేస్తవారిపేటలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



కారులో వెళ్లాలంటే తిప్పలే..



రోడ్డుపైనే బైక్ అడ్డుగా ఉండటంతో నిలిచిన ఆటో

కాటంరాజు ఆలయంలో సబ్ కలెక్టర్ పూజలు



పూజల్లో పాల్గొన్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: కాటంరాజు స్వామి ఆలయాన్ని మార్కాపురం సబ్‌కలెక్టర్ త్రివినాగ్ గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పి.వెంకటరాజు యాదవ్, పీఎల్పీ యాదవ్ ఘనస్వాగతం పలికారు. ఈనెల 29న నిర్వహిస్తున్న తిరునాళ్ల ఏర్పాట్లను సబ్‌కలెక్టర్‌కు వివరించి, సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతోపాటు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడిపేలా చూడాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బుర్రి చిన్నవెంకటేశ్వర్లు, పి.గోపాల్, నాగం వెంకటేష్ తదితరులు ఉన్నారు.

పార్కింగ్ సరే.. సౌకర్యాల సంగతేంటి?



బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పార్కింగ్

కంభం: కంభం బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించని ఆర్టీసీ అధికారులు.. వాహనాల పార్కింగ్‌కు రుసుం వసూలు చేయడం విమర్శలకు తావిస్తోంది. గత కొన్ని రోజులుగా ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ఆవరణలో కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదు. ఓ వైపు హోటళ్లు, ఇతర దుకాణాలతో బస్టాండ్ ఆవరణ కుంచించుకుపోగా మిగిలిన మరో భాగంలో గురువారం నుంచి పార్కింగ్‌కు టెండర్లు పిలిచి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు. టెండర్ దక్కించుకున్న వ్యక్తులు ఒక్కో వాహనం నుంచి రూ.20 వసూలు చేస్తున్నారు. ఆదాయంపై దృష్టి పెడుతున్న ఆర్టీసీ అధికారులు.. బస్టాండులో మంచినీరు, కనీస మౌలిక వసతులు కల్పించడంలో శ్రద్ధ చూపడం లేదని ప్రయాణికులు, ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేషన్ పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి

- రైస్ గోడౌన్ డీటీ సురేఖ



డీలర్ వద్ద ఈకేవైసీ చేయించుకుంటున్న కార్డుదారులు

పొదిలి రూరల్: రేషన్ దుకాణాల్లో సరుకులు పొందాలంటే తప్పనిసరిగా కార్డులోని ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని రైస్ గోడౌన్ డీటీ సురేఖ పేర్కొన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేసే సరుల్లో పారదర్శకత కోసం జాతీయ సమాచార సంస్థ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్‌ను నవీకరించారని తెలిపారు. ఇప్పటి వరకు రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ లేకున్నా సరుకులు అందజేసేవారని, ఇకపై అలా కుదరదని, కార్డులో ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న వారి వివరాలు ఆయా పంచాయతీలకు అందజేసినట్లు చెప్పారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థిక సహాయం



బాధితురాలికి నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గిద్దలూరు రూరల్: మండలంలోని ఓబులాపురంలో దుగ్గెపోగు రాములమ్మ పూరిగుడిసె ఈ నెల 16న అగ్ని ప్రమాదంలో దగ్ధం కాగా గురువారం ఆమెకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.భూదేవి, ఉప సర్పంచి పల్లా భారతి, నాయకులు బొర్రా కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, దిలీప్‌రెడ్డి, తాటగిరి ప్రతాప్, దుగ్గెపోగు యావన్, కొమ్మునూరి సుబ్బయ్య, బాబురావు పాల్గొన్నారు.

'వెలిగొండ' ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం మొండిచేయి

- ధర్నా, రాస్తారోకోలో సీపీఎం నేతలు



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు, ప్రజలు

మార్కాపురం: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం, పునరావాస పనులకు తగినన్ని నిధులు విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో మొండిచేయి చూపిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు విమర్శించారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా, కోర్టు సెంటరులో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో సవరణ చేసి వెలిగొండకు రూ.2 వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. 2026 వరద సీజన్ నాటికి వెలిగొండకు నీరివ్వాలన్నారు. కటాఫ్ తేదీని ఎత్తివేసి ప్రాజెక్టు నీరు వదిలే నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో అత్యంత తక్కువ ఖర్చుతో 80 శాతానికి పైగా పూర్తయిన ప్రాజెక్టు మిగులు పనులకు బడ్జెట్‌లో మొండిచేయి చూపి పశ్చిమ ప్రాంత ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. మార్కాపురాన్ని జిల్లా చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సోమయ్య డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని ప్రభుత్వమే చేపట్టాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించి కోర్టు సెంటరులో రాస్తారోకో చేశారు. దీంతో పోలీసులు కలుగజేసుకుని రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, పార్టీ నాయకులు జి.బాలనాగయ్య, ఆవులయ్య, తిరుపతిరావు, రూబెన్, ఏనుగుల సురేష్, అన్వర్, జవ్వాజి రాజు తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై శ్రీవారి ఉత్సవం



హనుమంత వాహనంపై స్వామివారు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. గురువారం వెంకటేశ్వరస్వామివారు హనుమంత వాహనంపై మహావిష్ణుమూర్తి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ ఉభయదాతలుగా తాడి తిరుపతిరెడ్డి, చినసుబ్బారెడ్డి, గాలిరెడ్డి, కొండారెడ్డి దంపతులు వ్యవహరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, సేవా కమిటీ అధ్యక్షుడు కాశిరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం గరుడోత్సవం, శనివారం గజోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ పేర్కొన్నారు. తిరునాళ్ల సందర్భంగా 21, 22, 23వ తేదీ ఎడ్ల పోటీలు, విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు, పౌరాణిక నాటకాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆదివారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసే వారు కమిటీకి సహకరించాలని సూచించారు.

తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు : దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ

వెలుగొండలో ఈ నెల 21, 22, 23వ తేదీల్లో నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవ తిరునాళ్లలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన దేవస్థానం సేవా కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, కొనకనమిట్ల ఎస్సై రాజ్‌కుమార్‌తో కలిసి వెలుగొండ క్షేత్రంలో పర్యటించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ముందుగా ఆలయంలో పూజలు చేశారు. అనంతరం రిటైర్డ్ ఐజీ, శ్రీకృష్ణ యాదవ అన్నదాన సేవా సంస్థ అధ్యక్షుడు పిన్నిక హరికుమార్‌తో మాట్లాడారు.

ఎడ్ల పందేలకు సర్వం సిద్ధం

వెలుగొండలో నేటి నుంచి మూడు రోజుల పాటు జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. పోటీలు నిర్వహించే ప్రాంగణం చుట్టూ కంచె వేయడంతోపాటు పశుపోషకులు, రైతుల కోసం షామియానాలు ఏర్పాటు చేశారు. ఆరు పళ్ల విభాగం, న్యూ కేటగిరీ, సీనియర్ విభాగాల్లో మొత్తం 35 జతల ఎడ్లు పాల్గొంటున్నట్లు సమాచారం.

అన్నదానానికి సత్రాల్లో ఏర్పాట్లు

వెలుగొండ వెంకటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా 21, 22, 23 తేదీల్లో అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలోని సత్రాల్లో భక్తులకు అన్నసంతర్పణ చేసేందుకు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం, బ్రాహ్మణ సత్రం, యోగి వేమన రెడ్ల అన్నదాన సత్రం, శ్రీకృష్ణ యాదవ అన్నదాన సత్రం, కాకతీయ కమ్మ అన్నదాన సత్రం, కుమ్మరి సత్రం, వడ్డెర సత్రం, గౌడ, ముదిరాజ్, గాండ్ల, పద్మశాలి, రజక, నాయిబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, కాపు అన్నదాన సత్రం, హరిజన మాల అన్నదాన సత్రాల్లో అన్న సంతర్పణకు ఏర్పాట్లు చేశారు.

ముస్తాబైన యాదవ అన్నదాన సత్రం

వెలుగొండ క్షేత్రంలోని శ్రీకృష్ణ యాదవ అన్నదాన సత్రంలో కమిటీ అధ్యక్షులు పిన్నిక హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.30 లక్షలు వెచ్చించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. కమిటీ సభ్యుడు మోడీ ఆంజనేయులు సహకారంతో శుక్రవారం రాత్రికి చెంచులక్ష్మి పౌరాణిక నాటకం, 22వ తేదీ రాత్రి పాట కచేరి ఏర్పాటు చేశారు.



ఎడ్ల పోటీలకు సిద్ధం చేసిన ప్రాంగణం



యాదవ అన్నదాన సత్రం

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

మార్కాపురం: పట్టణంలోని అరవింద్ ఘోష్ వీధిలో బుధవారం రాత్రి ఓ పిచ్చికుక్క పలువురిని కరవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. చీమలమర్రి చరణ్, ఎల్లప్ప, పుల్లమ్మతోపాటు పలువురిపై పిచ్చికుక్క దాడి చేయడంతో గాయాలపాలై స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్

మార్కాపురం టౌన్: స్థానిక బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు అవగాహన కల్పించారు. అనంతరం కరాటే మాస్టర్‌తో ఆత్మరక్షణకు అవసరమైన మెళకువలు నేర్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. తదనంతరం ఎస్టేట్ సమీపంలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.